సీఎం రేవంత్ కృషితో..
గురుకులాలు బలోపేతం
● సొంత భవనాలు నిర్మిస్తూ సౌకర్యాలను మెరుగుపరుస్తున్నాం
● నాణ్యమైన విద్యనందిస్తున్నాం ● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
7

యాచారంలో భారీ వర్షం

యాచారం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలో శనివారం ఉరుములు, మెరుపులతో గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలోని సొసైటీ బ్యాంక్ ఎదుట వరద నీరు నిలిచి ద్విచక్ర వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధర్మన్నగూడలో పత్తి పూర్తిగా తడిసిపోయింది. మేడిపల్లిలో పొలాల్లో వరద నీరు చేరింది. వర్షాలు పడుతున్నా మండలంలోని చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు చేరలేదని రైతులు చెప్పారు.



మహిళా సమస్యలపై ప్రజా విచారణ

రేపు గచ్చిబౌలిలోని పోలీస్ కమిషనరేట్‌లో కార్యక్రమం

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళా సమస్యలపై రాష్ట్రీయ మహిళా అయోగ్ ఆప్కే ద్వార్ - మహిళా జనసున్వాయి ఆధ్వర్యంలో ప్రజా విచారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో 15వ తేది ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి జాతీయ మహిళా కమిషన్ సభ్యులు డాక్టర్ అర్చన మజుందార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించే ప్రజా విచారణలో మహిళలు పెద్ద ఎత్తున హాజరై వారి ఫిర్యాదులను జాతీయ మహిళా కమిషన్‌కు సమర్పించుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి శ్రీలత తెలిపారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమల
అభివృద్ధే లక్ష్యం

పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



బీఎన్ఐ వాంటేజ్ గోనాట్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

శంషాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో శనివారం బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) వాంటేజ్ గోనాట్-2025ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎన్ఐకి సంబంధించిన గో నేషనల్ వ్యవస్థ హైదరాబాద్ చాప్టర్ ద్వారా దాదాపు 58 నెట్‌వర్కింగ్ చాప్టర్స్ ప్రతినిధులు సమావేశమయ్యారన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వీరు చిన్నా మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించిన వారి ఉత్పత్తుల గురించి, వాణిజ్యపర అంశాలపై ఈ కాన్ఫరెన్స్‌లో వివరించారని తెలిపారు. అనేక పరిశ్రమలకు సంబంధించిన వస్తువులకు మార్కెట్ లింకేజ్ చేయాలనే ఉద్దేశంతోనే ఈ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బీఎన్ఐ సంస్థ అనేక సంవత్సరాలుగా ఇదే ప్రయత్నం చేస్తుందని కొనియాడారు. ఈ రోజు పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వడానికే ఎంఎస్ఎంఈ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) పాలసీని మా ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. అనంతరం కాన్ఫరెన్స్ డైరెక్టర్ సంజన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చిన్నమధ్య తరహా పరిశ్రమలకు ఎంతో ప్రోత్సాహం లభిస్తుందన్నారు. అందుకు చక్కటి ఉదాహరణ నేడు బీఎన్ఐ ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్‌కు స్వయంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్వయంగా రావడమేనని ఆమె అన్నారు. అంతకు ముందు ఇక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ పరిశ్రమలకు సంబంధించిన స్టాల్స్ నిర్వాహకులు బీఎన్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆదిభట్ల శాండ్ బజార్‌లో ఇసుక నిల్వలు

ఇసుక కష్టాలు!

వర్షాల కారణంగా రవాణాకు బ్రేక్

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో ఇసుక రవాణాకు అంతరాయం ఏర్పడింది. 15 రోజులుగా బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ మేరకు ఇసుక దొరకడం లేదు. దీంతో ఇళ్ల నిర్మాణాలకు బ్రేక్ పడింది. వర్షాల మూలంగా రీచ్‌ల వద్ద ఇసుక లోడ్ చేయడానికి ఎక్కువ సమయం పడుతుండటంతో రవాణా తగ్గిపోయింది. రీచ్‌ల వద్ద చాలా లారీలు రోజుల తరబడి నిలిచి పోవడంతో ఇసుక లభ్యత తగ్గిపోయి వ్యాపారులు ధరలు పెంచేశారు. ఎప్పుడైనా దొడ్డు ఇసుకకు తక్కువ, సన్న ఇసుకకు రూ.200 అటు ఇటుగా ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్లో దొడ్డు ఇసుక టన్నుకు రూ.2,600 నుంచి రూ. 2,700 పలుకుతుండగా, సన్న ఇసుక రూ.2,300 నుంచి రూ.2,400 పలుకుతుంది. మరో వారం రోజులు ఆగితేగాని ఇసుక ధరలు దిగివచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

- బహిరంగ మార్కెట్‌లో పెరిగిన ధర
- నిలిచిన నిర్మాణాలు
- దొడ్డు ఇసుక టన్నుకు రూ.2,700
- సన్న ఇసుక రూ.2,400
- ఇసుక బజార్‌ల ఏర్పాటుతో ఉపశమనం
- క్యూ కడుతున్న లారీలు



ఆదిభట్ల ఇసుక బజార్ వద్ద క్యూకట్టిన లారీలు (ఫైల్)

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో ఇసుక రవాణాకు అంతరాయం ఏర్పడింది. 15 రోజులుగా బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ మేరకు ఇసుక దొరకడం లేదు. దీంతో ఇళ్ల నిర్మాణాలకు బ్రేక్ పడింది. వర్షాల మూలంగా రీచ్‌ల వద్ద ఇసుక లోడ్ చేయడానికి ఎక్కువ సమయం పడుతుండటంతో రవాణా తగ్గిపోయింది. రీచ్‌ల వద్ద చాలా లారీలు రోజుల తరబడి నిలిచిపోవడంతో ఇసుక లభ్యత తగ్గిపోయి వ్యాపారులు ధరలు పెంచేశారు. ఎప్పుడైనా దొడ్డు ఇసుకకు తక్కువ, సన్న ఇసుకకు రూ.200 అటు ఇటుగా ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్లో

మిగతా 8వ పేజీలో...



వర్షాలు కురుస్తుండటంతో..

ఇసుక అక్రమ రవాణాను చెక్ పెట్టిన ప్రభుత్వం సాండ్ బజార్లను అందుబాటులోకి తెచ్చింది. గతంలో ఇసుక మాఫియా నకిలీ వే బిల్లులతో జీరో దందా కొనసాగించేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా ఇసుక రవాణాను పారదర్శకం చేయడంతో ఇసుక ధరలు నిలకడగా ఉన్నాయి. ఈ మధ్య కాలంలో వర్షాల మూలంగా ఇసుక రవాణా తగ్గి డిమాండ్ పెరిగింది. వారం రోజులు ఆగితే ఇసుక ధరలు అందుబాటులోకి వస్తాయి.

- మంచిరెడ్డి రాజేందర్‌రెడ్డి, తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగేంద్రబాబు



ప్రజావైద్యశాల (నర్సింగ్ హోమ్) ఆసుపత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

చేవెళ్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగేంద్రబాబు తెలిపారు. పట్టణంలోని ప్రజావైద్యశాల (నర్సింగ్ హోమ్)లో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా గత మే నెలలో కేసారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. దీంతో నర్సింగ్‌హోమ్‌ను వైద్యాధికారులు సీజ్ చేశారు. అయితే కొన్నిరోజులకే నర్సింగ్‌హోమ్‌ను తెరిచి యథావిధిగా నడిపిస్తున్నట్లు డీఎంహెచ్‌వోకు తెలిసింది. ఆయన ఆదేశాల మేరకు శనివారం చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో నర్సింగ్ హోమ్ వద్దకు వెళ్లి మళ్లీ సీజ్ చేశారు. నోటీసులను కూడా అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజ్ చేసిన నర్సింగ్ హోమ్‌ను మళ్లీ తెరవడం చట్ట విరుద్ధమన్నారు. మెడికల్ నిబంధనల చట్టం 2010 ప్రకారం నర్సింగ్ హోమ్‌కు రూ.5లక్షలు జరిమానా విధించాలని ఉన్నతాధికారులకు నివేదిక అందించామన్నారు. కార్యక్రమంలో ఆలూరు, శంకర్‌పల్లి వైద్యులు పద్మావతి, అన్నపూర్ణ, తదితరులు ఉన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కర్ణకుమార్



ఒప్పంద అవార్డును ఇరుపక్షాలకు అందజేస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కర్ణకుమార్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ ఉత్తమ మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కర్ణకుమార్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని కోర్టుల ప్రాంగణాలలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ బెంచ్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే సివిల్ కేసులలో చెల్లించిన కోర్టు ఫీజులు కూడా తిరిగి పొందవచ్చన్నారు. ఆస్తిపరమైన, కుటుంబ సమస్యల కేసులు పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్, మధ్యవర్తిత్వం ఒక చక్కటి వేదిక అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాలలో 30 లోక్‌అదాలత్ బెంచిలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సుమారు 18,068 పైచిలుకు కేసులు పరిష్కరించబడ్డాయని కార్యదర్శి శ్రీవాణి తెలిపారు. అన్ని కేసులలో కలిపి మొత్తం రూ. 21,78,05,546 వరకు నష్ట పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి మంగల్‌పల్లి వద్ద అక్రమంగా నిల్వ చేసిన నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. సీఐ మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... అబ్దుల్లాపూర్ మండలం మన్నెగూడలో నివాసం ఉంటున్న కునులోత్ నరేష్ ఆదిభట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లి వద్ద కిరాణా వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కాగా రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతరులకు ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులకు అందింది. దీంతో శనివారం షాపులో తనిఖీ చేయగా నాలుగు టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నరేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.





ముళ్లకంపలో ట్రాన్స్‌ఫార్మర్

పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు

యాచారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్లకంప పెరిగి ప్రమాదకరంగా ఉంది. తీగజాతి మొక్కలు అల్లుకోవడంతో తరచూ విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలుగుతుంది. పిచ్చిమొక్కలు పెరగడంతో విషసర్పాలు కూడా తిరుగుతున్నాయని ఇందిరాక్రాంతి పథకం ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ముళ్లకంపను తొలగించాలని కోరుతున్నారు. - యాచారం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి)

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పరిగి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై-2 నాగేందర్ అన్నారు. శనివారం పరిగిలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపడం నేరం అన్నారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు తప్పక ధరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

గ్రామాల్లో తాగునీటి తిప్పలు

● నిలిచిన మిషన్ భగీరథ నీరు

ధారూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తిప్పలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. తాగునీటి సమస్యపై మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోక ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. శనివారం మున్నూరు సోమారం, రుద్రారం, ధారూరు, తరిగోపుల, నర్సాపూర్ గ్రామాల్లో నీటి సమస్య తలెత్తింది. మున్నూరు సోమారంలో తాగునీటి పైపు పగిలి ఎస్సీ కాలనీలో నీటి సరఫరా లేక ట్యాంకర్, బైకులు, ఆటోలపై నీరు తెచ్చుకున్నారు. రుద్రారం, తరిగోపుల, ధారూరు ఇతర గ్రామాల్లో ప్రత్యామ్నాయ నీటి వనరుల్లేక ప్రజలు వ్యవసాయ బోర్లను ఆశ్రయించారు. తాగునీటి సమస్యపై అధికారులు, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవటంలేదని మున్నూరు సోమారం ఎస్సీ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపులైన్ పగిలి వారం రోజులైనా మరమ్మతులు చేయించలేదన్నారు. గ్రామ శివారు నుంచి వాహనాలపై నీటిని తెచ్చుకుంటున్నామని, వాహనాల్లేని వారు నడుచుకుంటూ పోయి నీళ్లు మోసుకొచ్చుకుంటున్నారని చెప్పారు. నీటి సమస్యపై అధికారులు స్పందించకపోతే ఖాళీ బిందెలతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రత్యేక అధికారులు గ్రామాలవైపు కన్నెత్తి చూడటం లేదని, నీటి సమస్యలపై చెప్పినా పట్టించుకోవటం లేదని ప్రజలు మండిపడుతున్నారు. వానకాలంలో నీటి సమస్యలు తామెన్నడూ చూడలేదని, ఇప్పటికైనా అధికారులు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


మున్నూరు సోమారంలో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు


మున్నూరుసోమారంలో ఆటోలో బిందెలతో తాగునీరు తీసికెళ్తున్న మహిళలు


రుద్రారంలో హ్యాండ్ బోర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు


యాచారంలో నిరసన తెలుపుతున్న తెలంగాణ ఉద్యమకారులు

ఉద్యమకారులను ఆదుకోండి

ఇబ్రహీంపట్నం/యాచారం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను ఆదుకోవాలని ఉద్యమకారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల చైతన్యయాత్ర ఇబ్రహీంపట్నం, యాచారం మండలాల్లో శనివారం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఉద్యమకారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలుపుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతీ ఉద్యమకారుడికి 250 గజాల ఇంటిస్థలం కేటాయించాలని కోరారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులివ్వాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.10వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు.ఉద్యమకారుల పిల్లలకు ఉద్యోగాల్లో 20శాతం కేటాయించాలని కోరారు. ఉద్యోగాల భర్తీలో 90శాతం తెలంగాణ రాష్ట్ర వాసులకే కేటాయించాలని అన్నారు. ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు ఎట్టి పరిస్థితుల్లో ఉద్యోగాలు కేటాయించొద్దని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం నాయకులు కిషన్, బి.వీరేశం, కె.శంకర్, యాదయ్య, శ్యామల, నక్క జంగయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి వెనకాడం

ఘట్‌కేసర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'ఎద్దేడ్చిన ఎవుసం.. రైతేడ్చిన రాజ్యం బాగుపడవ్,' అని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల నాలుగో రోజు శిబిరం వద్దకు ఎంపీ వచ్చి రైతులకు సంఘీభావం ప్రకటించారు. రైతు సమస్యల పరిష్కారానికి తాను ఎంతదూరమైన వెళ్లేందుకు వెనకాడనని అన్నారు. ప్రభుత్వం రుణమాఫీ ఇప్పటికీ చెల్లించకపోవడం అన్యాయమన్నారు. పోలీసులు ప్రజల కోసం పనిచేయాలేగానీ నాయకుల కోసం కాదన్నారు. రైతుల దీక్షకు తన పూర్తి మద్దతుంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రుణమాఫీ చేసిన ప్రభుత్వం ఘట్‌కేసర్, మూడుచింతలపల్లి మండలాల రైతులకు ఎందుకు చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే ప్రజలు కర్రుకాల్చి వాతపెడతారన్నారు. ఇప్పటికైనా రైతులకు రూ.9కోట్ల రుణమాఫీ చెల్లించాలన్నారు. అవసరమైతే తాను సీఎంతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, విక్రంరెడ్డి, రుణమాఫీ సాధన సమితి నాయకులు పాల్గొన్నారు.



రైతులు చేపట్టిన దీక్షలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

అలైన్‌మెంట్ మార్చే వరకు పోరాటం


దీక్షలో కూర్చున్న భూ నిర్వాసితులకు సంఘీభావం తెలుపుతున్న వేణుగోపాల్, నాయకులు

కడ్తాల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అలైన్మెంట్ మార్చే వరకు పోరాటం కొనసాగిస్తామని కడ్తాల మండల హైటెన్షన్ విద్యుత్ లైన్ భూనిర్వాసితులు అన్నారు. ప్రజాప్రతినిధులు సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి తమకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. బీదర్ నుంచి మహేశ్వరం వరకు చేపడుతున్న 765కేవీ హైటెన్షన్ విద్యుత్ అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ కడ్తాలలో నిర్వాసితులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు శనివారం ఆరో రోజుకు చేరాయి. దీక్షలో క్యామ సత్యనారాయణ, కందికంటి శ్రీరాములుగౌడ్, గోరటి జంగయ్య, వరికుప్పల అంజయ్య, బాలయ్య కూర్చున్నారు. దీక్ష శిబిరాన్ని మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, జి.లక్ష్మీనర్సింహారెడ్డి, రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి రైతులకు సంఘీభావం ప్రకటించారు. టవర్ల పనులు నిలిపివేసి అలైన్‌మెంట్ మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. పంట పొలాల మీదుగా లైన్ వేస్తే తాము ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామన్నారు. ఇతర ప్రాంతాల మీదుగా ఉన్న అలైన్‌మెంట్‌ను కొందరు పారిశ్రామికవేత్తల ఒత్తిడితో కడ్తాల మీదుగా మార్చడం సరికాదని నాయకులన్నారు. ప్రజలకు, రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కడారి రామకృష్ణ, బీసీ సంఘం మండలాధ్యక్షుడు పి.వెంకటేశ్, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రమేశ్, అంబేడ్కర్ యువన సంఘాల నాయకుడు దాసు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణ రక్షణ

● అందరూ అవగాహన పెంచుకోవాలి
● సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి


సీపీఆర్ విధానాన్ని వివరిస్తున్న డాక్టర్ చందులాల్ రాథోడ్, చిత్రంలో షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురవుతున్న వారి ప్రాణాలను సీపీఆర్‌తో రక్షించొచ్చని షాద్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.స్వాతిరెడ్డి తెలిపారు. షాద్‌నగర్ కోర్టు సముదాయంలో విజయ కార్డియక్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ చందులాల్ రాథోడ్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జడ్జిలు, న్యాయవాదులు, ఇతరులకు వైద్య పరీక్షలు చేశారు. గుండె పోటుకు గురైన వారికి సీపీఆర్ చేసి ప్రాణాలను ఎలా రక్షించాలో చందులాల్‌రాథోడ్ వివరించారు. గుండెపోటుకు గురైన వెంటనే సీపీఆర్ చేస్తే 30శాతం మందికి ప్రాణాలు నిలుస్తాయని చెప్పారు. గుండెపోటుతో అపస్మారక స్థితికి చేరిన వారిని వెల్లికిలా పండుకోబెట్టి గుండె కొట్టుకునేలా చేయడమే సీపీఆర్ అన్నారు. అంబులెన్స్ వచ్చే వరకుగానీ 45నిమిషాల పాటుగానీ సీపీఆర్ చేయాలన్నారు. ప్రతి 30సెకండ్లకు ఒక్క క్షణం ఆగి, రక్తం గుండెలోకి వచ్చిపోయేలా సీపీఆర్ చేస్తే ప్రాణాలు దక్కుతాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో నీరు తాగించొద్దని డాక్టర్ చెప్పారు. జడ్జి ఎస్.స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. సీపీఆర్ విధానాన్ని న్యాయవాదులు నేర్చుకుని, ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. తాను సిద్దిపేట కోర్టులో పనిచేసిన సమయంలో కోర్టు ఆవరణలో ఓ మహిళకు గుండెపోటు రాగా సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడామని తెలిపారు. సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న రాథోడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రవి, అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ ఎం.సాహితి, బార్ అసోసియేషన్ చైర్మన్ వేణుగోపాల్ రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల వేతనాల్లో కోత అన్యాయం

తాండూరు రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం కరన్‌కోట్ సీసీఐ కర్మాగారంలో ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులకు జీతంలో కోత విధించడం అన్యాయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కరన్‌కోట్ సీసీఐ కర్మాగారంలో ప్యాకింగ్ ప్లాంట్ కార్మికుల తరపున ఆయన జీఎంకు వినతిపత్రం అందజేశారు. ప్యాకింగ్ ప్లాంట్ కర్మాగారంలో కార్మికులకు రోజుకు రూ.610 వేతనం వచ్చేదని, ప్రస్తుతం ప్రతీ కార్మికుడికి రూ.100 చొప్పున కోత విధిస్తున్నారని, ఇది అన్యాయం అన్నారు. ప్యాకింగ్ ప్లాంట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం కాంట్రాక్టర్‌తో చర్చించి వేతన కోత తీసేయాలని కోరారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఆయనతో కార్మిక నాయకుడు దస్తప్ప ఉన్నారు.

రైతాంగ సాయుధ పోరాటం చారిత్రక మలుపు

హయత్‌నగర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఒక చారిత్రక మలుపని ప్రముఖ వక్త, ఆవాజ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అబ్బాస్ అన్నారు. శనివారం తుర్కయంజాల్‌లోని అరుణ కన్వెన్షన్‌లో 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం-వాస్తవాలు, వక్రీకరణలు' అనే అంశంపై జిల్లా టీఎస్‌యూటీఎఫ్ ఆధర్యంలో సెమినార్ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అబ్బాస్ మాట్లాడుతూ.. 1946 సెప్టెంబరు 11న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రారంభమైందన్నారు. నిజాం ప్రభుత్వం, రజాకార్లు జరిపిన దమనకాండకు ఎదురొడ్డి నిలిచిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు అన్నారు. నాటి జరిగిన విషయాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. మేధావులు మౌనంగా ఉంటే చరిత్రను వక్రీకరిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. నిజాం ప్రభుత్వ అరాచకాలు, రజాకార్ల దాడులపై కమ్యూనిస్టు పార్టీ తిరుగుబాటు చేసి ప్రజలకు రక్షణగా నిలిచిందన్నారు. మతోన్మాదుల దుష్ప్రచారాలను వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటప్పయ్య, నాయకులు రాములయ్య, సుగంధ, నాయకులు కిషన్, కస్సనా, బి.రాములయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమెన్ ఎంపవర్మెంట్ బోర్డు చైర్మన్ సత్యం

కేంద్ర పథకాలను తెలుసుకోవాలి

వికారాబాద్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి):మహిళాభ్యున్నతి, విద్యా అవకాశాలు, స్వయం ఉపాధికి కేంద్ర ప్రభుత్వ పథకాల తెలుసుకోవాలని రాష్ట్ర సోషల్ జస్టిస్ అండ్ ఉమెన్ ఎంపవర్మెంట్ బోర్డు చైర్మన్ దోర్నాల్ సత్యం అన్నారు. శనివారం వికారాబాద్‌లో పర్యటించి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు ఆయన బోర్డు విధివిధానాలు, సభ్యుల బాధ్యతలను వివరించారు. వెనకబడిన తరగతులు, మధ్య తరగతి మహిళల అభివృద్ధికి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాయగారి వేమారెడ్డి, బైరిశెట్టి శశిధర్, కావలి శ్రీధర్, తుమ్మ వీరస్వామి, జిల్లా కమిటీ సభ్యులు పాండుగౌడ్, రాములు, రాజేందర్ గౌడ్, మహేశ్, ప్రవీన్, నర్సింలు, శ్రీనివాస్, అరుణ్, దత్తాత్రేయ పాల్గొన్నారు.

ప్రమోషన్లతో ఖాళీలు భర్తీ చేయాలి

ఇబ్రహీంపట్నం,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మిగిలిపోయిన ఖాళీ పోస్టులను అర్హత కల్గిన ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పుట్టపాక ప్రవీణ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నంలో శనివారం జరిగిన ఎస్టీయూ సెక్టార్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గెజిటెడ్ హెచ్‌ఎంలు, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు అధ్యాపకుల పోస్టులు చాలా మిగిలిపోయాయని చెప్పారు. వీటి భర్తీకి అర్హత ఉన్న టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయాలని కోరారు. సంవత్సరం పాటు పదోన్నతులు కల్పించకుంటే రిటైరయ్యే చాలా మంది ఉపాధ్యాయులు అదే క్యాడర్‌తో ఉద్యోగ విరమణ పొందుతారని, దీంతో వారు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం గెజిటెడ్ హెచ్‌ఎంగా ప్రమోషన్ పొందిన కంబాలపల్లి జగన్‌మోహన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండురంగారెడ్డి, ఏఐఎస్టీఎఫ్ ఉపాధ్యక్షుడు పరమేశ్, నాయకులు శ్రీనివాసరావు, బాలకృష్ణ, శ్రీనివాస్, మల్లేశ్, రాజు, తిరుమలేశ్, భాస్కర్‌నాయక్, నారాయణరెడ్డి, పాండు, లింగం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


సెక్టార్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్

బుగ్గ క్షేత్రంలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తాం



బుగ్గ రామలింగేశ్వరాలయం వద్ద అధికారులు

మంచాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆరుట్ల సమీపంలో గల బుగ్గ క్షేత్రంలో భక్తుల కోసం సౌకర్యాలు కల్పిస్తామని మంచాల ప్యాక్స్‌చైర్మన్ వెదిరె హన్మంతరెడ్డి తెలిపారు. వివిధ శాఖల అధికారులతో కలిసి శనివారం బుగ్గ రామలింగేశ్వర క్షేత్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. బుగ్గ జాతర నవంబరు 5 నుంచి ప్రారంభమవుతుందని, 15రోజులు జరిగే కార్తీక మాస ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరిస్తారని తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో బుగ్గ క్షేత్రంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎంపీడీవో బాలశంకర్, తహసీల్దార్ ప్రసాద్‌రావు, ఈవోఆర్డీ ఉమారాణి, ఆలయ కమిటీ సభ్యులు రమణారెడ్డి, ఆనంగళ్ల యాదయ్య, దాసరమోని రమేష్, ఎన్నుదుల సురేష్, మానిపాటి వెంకటేష్, మాదగోని జంగయ్యగౌడ్, సాతిరి శంకరయ్య పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు మేలు జరిగేలా నిర్ణయం



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

ఆమనగల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులకు మేలు జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎప్పుడూ రైతుల పక్షమేనని చెప్పారు. అన్నెబోయిన్‌పల్లి, బ్రాహ్మణపల్లి, చంద్రాయన్‌పల్లి గ్రామాలకు చెందిన ట్రిపుల్‌ఆర్ నిర్వాసితులు శనివారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లో కలిశారు. ట్రిపుల్‌ఆర్‌ను పాత అలైన్‌మెంట్ ప్రకారమే చేపట్టాలని నిర్వాసిత రైతులు కోరారు. పొలాల మీదుగా ట్రిపుల్‌ఆర్ నిర్మించి తమను రోడ్డుపాల్జేయొద్దని ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి తమకు అన్యాయం జరుగకుండా చూడాలని కసిరెడ్డిని అభ్యర్థించారు. ఈ విషయం సీఎం రేవంత్ రెడ్డికి వివరిస్తానని ఎమ్మెల్యే తెలిపినట్లు వారు పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆయా గ్రామాల రైతులు, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ ఫలాలు



దివ్యాంగుడి సమస్యను తెలుసుకుంటున్న లక్ష్మారెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం దాసర్లపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు గ్రామ దివ్యాంగుల సమస్యలను వివరించడానికి తుక్కుగూడలోని కేఎల్లార్ క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేయని పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన తెలిపారు. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని దివ్యాంగుడు మల్లేశ్ కేఎల్లార్ దృష్టికి తీసుకెళ్లాడు. దాంతో ఆయన వెంటనే స్పందించి హౌసింగ్ బోర్డు అధికారికి ఫోన్‌చేసి అతడికి ఇల్లు మంజూరు చేయించారు. మహేశ్వరం ఏఎంసీ డైరెక్టర్ యుగేందర్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ల అనుభవం పార్టీకి అవసరం

● హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



సత్యనారాయణను పరామర్శిస్తున్న బండారు దత్తాత్రేయ

కీసర రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సీనియర్ల అనుభవం పార్టీకి ఎంతో అవసరమని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం నాగారంలో ఉంటున్న బీజేపీ నాయకుడు సత్యనారాయణను పరామర్శించేందుకు దత్తాత్రేయ వచ్చారు. నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పార్టీ విషయాలపై సమీక్షించారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, నాయకులు మల్లారెడ్డి, సురేష్, శ్యాం, తిరుమల్‌రెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, కందాడి సత్తిరెడ్డి, రవీందర్‌రెడ్డి, నాగరాజు, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హరినామ సంకీర్తనలో భజన మండలి సభ్యులు



తిరుమలలో హరినామ సంకీర్తన చేస్తున్న భజన మండలి సభ్యులు

కొడంగల్ రూరల్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహించే అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో శనివారం రుద్రారానికి చెందిన శ్రీ వీరాంజనేయస్వామి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. రెండు రోజుల క్రితం ఈ భజన మండలి సభ్యులు తిరుమల తరలివెళ్లారు. 2012 నుంచి ఏటా రెండు రోజులు తిరుమలలో వారు భజన చేస్తున్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో తిరుమలలో అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్నట్లు భజన మండలి సభ్యులు తెలిపారు. భజన మండలి సభ్యులు సంగమేష్, మనోహర్, మాజీ సర్పంచ్ టి.సాయిలు, బన్సీలాల్, నాగరాజు, అంబయ్యగౌడ్, మోహన్‌రెడ్డి, టి.సందప్ప, సి.శేఖర్, వి.రాజేష్, పి.శివ తదితరులు పాల్గొన్నారు.

బాపల్లి తండా భూ సమస్యలు పరిష్కరించాలి



సీఎం రేవంత్‌రెడ్డితో సంతోష్

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాపల్లి తండా భూ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ యువజన నాయకుడు బాపల్లి సంతోష్‌నాయక్ కోరారు. శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆయన వినతిపత్రం అందించారు. స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి దీర్ఘకాలిక భూ సమస్యలు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం అవుతాయని తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులతో కమిటీ ఏర్పాటుతో గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అభివృద్ధికి నిధుల మంజూరు హర్షణీయం

చేవెళ్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి):మండల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయడం హర్షణీయమని చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ మర్పల్లి మాలతికృష్ణారెడ్డి, ముడిమ్యాల్ ప్యాక్స్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం కాంగ్రెస్ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు బుయ్యని శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో క్యాంప్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ చేవెళ్లకు రూ.9.9కోట్ల హెచ్ఎండీఏ నిధులు మంజూరు చేసిన సీఎంకు, ఎమ్మెల్యే యాదయ్యకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఎమ్మెల్యే కృషివల్లనే మండలానికి ప్రత్యేకంగా నిధులు వచ్చాయన్నారు.

అవే బారులు.. యూరియా వెతలు



ధారూరు: మోమిన్‌కుర్దులో లైన్లో నిలబడిన రైతులు



చౌదరిగూడ: లాల్‌పహాడ్‌లో యూరియా కోసం వచ్చిన రైతులు



దోమ: మోత్కూర్ ఆగ్రోస్ సెంటర్ వద్ద బారులు తీరిన రైతులు



యాలాలలో యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

యాలాల/ధారూరు/చౌదరిగూడ/దోమ,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా రైతులను యూరియా కొరత వేధిస్తోంది. 20 రోజులుగా రైతులకు సరిపడా యూరియా అందడం లేదు. ఉదయం నుంచే ఆగ్రోస్ కేంద్రాలు, రైతు వేదికలు, ఫర్టిలైజర్ దుకాణాలు, సొసైటీ కార్యాలయాలు.. ఇలా ఎక్కడ యూరియా విక్రయిస్తున్నారని తెలిస్తే అక్కడ రైతులు లైన్లు కడుతూ పాట్లు పడుతున్నారు. శనివారం యాలాలలో ఉదయం నుంచి వ్యవసాయ కేంద్రం వద్ద రైతులు గంటల తరబడి లైన్లో నిల్చున్నారు. ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున అధికారులు అందజేశారు. ధారూరు మండలం మోమిన్‌కుర్దులో ఆగ్రోస్ కేంద్రం వద్ద యూరియా కోసం క్యూ కట్టారు. మోమిన్‌కుర్దు, రాజాపూర్, అంతారం, మోమిన్‌కలాన్ గ్రామాల రైతులు ఉదయం నుంచే తరలివచ్చారు. ఏఈవో మల్లేశం 251టోకెన్లు జారీచేశారు. 450 బస్తాలు రాగా 180 మందికి రెండు బస్తాల చొప్పున, 71మరో మందికి ఒక్కో బస్తా పంపిణీ చేశారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని, సరిపడా యూరియాను వస్తుందని జిల్లేడ్ చౌదరిగూడ ఏవో రాజేందర్‌రెడ్డి చెప్పారు. ఎదిర రైతు వేదికలో, లాల్‌పహాడ్ ఫర్టిలైజర్ దుకాణాల్లో యూరియాను పంపిణీ చేశారు. దోమ మండలం మోత్కూర్, దిర్సంపల్లిలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో 30టన్నుల యూరియాను అధికారులు సరఫరా చేశారు. రైతులు తరలిరావడంతో కొందరికే లభించింది. అధికారులు సరిపడా యూరియాను సరఫరా చేయాలని కోరారు.

సిబ్బంది లేక ఇబ్బంది

● ఆమనగల్లు మునిసిపాలిటీలో పోస్టులు ఖాళీ

● 23 మంది ఉద్యోగులకు గాను నలుగురే రెగ్యులర్ అధికారులు

● సేవలందక ప్రజల ఇక్కట్లు



ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయం

ఆమనగల్లు,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది పోస్టుల ఖాళీతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నవారిపై పనిభారం ఎక్కువవుతోంది. ఈ కార్యాలయంలో కమిషనర్, ముగ్గురు రెగ్యులర్ ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. 15 వార్డులకు ఒకే వార్డు అధికారి ఉన్నారు. 23 పోస్టులకు నలుగురు రెగ్యులర్, ఇద్దరు ఇన్‌చార్జి అధికారులు పనిచేస్తున్నారు.దీంతో ప్రజలకు మెరుగైన సేవలందడం లేదు. టీపీవో, ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రెగ్యులర్ ఉద్యోగులు లేక నిర్వహణ, పర్యవేక్షణకు ఇబ్బందికరంగా మారింది. వడ్డేపల్లి మున్సిపల్ టీపీవో వరప్రసాద్ ఆమనగల్లు, ఆదిబట్లకు ఇన్‌చార్జిగా ఉన్నారు. వారు వారంలో రెండు రోజులే ఆమనగల్లు వస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలపై పర్యవేక్షణ కొరవడింది. పెద్ద అంబర్‌పేట ఏఈ శ్రీనివాసులు ఇన్‌చార్జిగా ఉన్నారు. వారంలో ఒకటి రెండు రోజులే వస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేక పారిశుధ్య పనులను పర్యవేక్షించే వారు లేరు. సీనియర్ అకౌంటెంట్ హిమబిందు మూడు నెలల క్రితం జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీగానే ఉంది. రెండు జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులూ వేకెన్సీ ఉన్నాయి. రెండేళ్ల క్రితం రెవెన్యూ శాఖ నుంచి వార్డు అధికారులు, జూనియర్ అసిస్టెంట్లు చేరినా వారిలో 13మంది గ్రామ పాలన అధికారులుగా రిక్రూటై రిలీవయ్యారు. ఇప్పుడు 14 వార్డు అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రిలీవైన వారి స్థానంలో కొత్తవారిని నియమించకుంటే సమస్యలు జఠిలం అవుతాయి. మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ అన్నీ తానై చూసుకుంటున్నారు. వార్డు ఆఫీసర్లు లేక ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల్లో ఆలస్యమవుతోంది. ప్రభుత్వం వెంటనే ఖాళీ పోస్టులను భర్తీచేయాలని ప్రజలు కోరుతున్నారు.



బాల్య వివాహాల నిర్మూలనపై భూకైలాస్ ఆలయంలో పురోహితులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సాధన ఎన్జీవో జిల్లా కో-ఆర్డినేటర్ రమేష్‌యాదవ్

బాల్య వివాహాలను నిర్మూలించాలి

తాండూరు రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను రూపుమాపాలని సాధన ఎన్జీవో జిల్లా కో-ఆర్డినేటర్ రమేష్‌యాదవ్ అన్నారు. శనివారం తాండూరులోని భావిగి భద్రేశ్వరస్వామి ఆలయం, కాళికాదేవి ఆలయం, కోకట్ సాయిబాబా ఆలయం, అంతారంలోని భూకైలాస్ ఆలయాల్లో బాల్య వివాహాలను నిర్మూలించాలని కోరుతూ పురోహితులతో ప్రతిజ్ఞ చేయించారు. రమేష్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు పురోహితులు, పాస్టర్లు, ఖాజీలు సహకరించాలని కోరారు. అమ్మాయిలకు 18ఏళ్లు, అబ్బాయిలకు 21ఏళ్లు నిండిన తర్వాతనే పెళ్లి చేయాలని స్పష్టం చేశారు. బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే చైల్డ్‌లైన్ 1098, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నర్సింహులు, రమేష్, రోజా, శ్రీనివాస్‌రెడ్డి, పురోహితులు కిరణ్, తిరుమలరావు, నర్సింహులు, జగదీశ్వర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

వచన రచనల్లో మేటి.. కవి కోటం చంద్రశేఖర్

● తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారానికి ఎంపిక



పురస్కారం అందుకుంటున్న చంద్రశేఖర్(ఫైల్)

తాండూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రాంతానికి చెందిన బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి కోటం చంద్రశేఖర్ తెలుగు సాహిత్యంలో వచన రచనలు, కవిత్వం ప్రవృత్తిగా ముందుకెళుతున్నారు. ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు హకీంపేట్(కోస్గి మండలం)లో మేనేజర్‌గా రిటైరైన చంద్రశేఖర్ క్షిపణి, ఆవిష్కరణ, సమ్మోహనం అనే మూడు పుస్తకాలను రచించారు. 2వేలకుపైగా కవితలు రాశారు. 1995లో డాక్టర్ సి.నారాయణరెడ్డి నుంచి సాహితీ పురస్కారాన్ని పొందారు. 2004లో అమెరికా తెలుగు సంఘం నిర్వహించిన తెలుగు రచనల పోటీల్లో 'మౌనం ఇద్దరి మధ్య' కవితకు బహుమతి పొందారు.2007లో రాష్ట్రస్థాయి ఉత్తమ కావ్యం, రంజని కుందుర్తి, ఎక్స్‌రే అవార్డు పొందారు. 2014లో కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం కవిత్వ విభాగంలో ముదిగంటి వెంకటనర్సింహారెడ్డి సాహితీ పురస్కారాన్ని అందజేసింది. కళాభారతి సంస్థ కళాహంస పురస్కారం ఇచ్చింది. 2015లో తెలంగాణ సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. చంద్రశేఖర్ ప్రపంచ తెలుగు మహాసభల్లో వచన కవిత్వాన్ని పఠించారు. తాజాగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 23న అవార్డును అందుకోనున్నారు.



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంఈవో శంకరయ్య

విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పాఠాలు బోధించడంతో పాటు విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలని మేడ్చల్ ఎంఈఓ శంకరయ్య అన్నారు. మేడ్చల్‌లోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో శనివారం రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ తరపున ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పలువురు టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ... సమాజంలో గౌరవప్రద వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. తరగతి గదుల్లో కేవలం పాఠాలు బోధించటంతో పాటు విద్యార్థులకు జీవతపాఠాలు నేర్పి వారు ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో వక్తలు ఆజాద్ అహ్మద్, ట్రెస్మా జిల్లా నాయకులు మంజుల ప్రకాశ్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక వసతులతో అంగన్‌వాడీ కేంద్రాలు

● షాద్‌నగర్ నియోజకవర్గానికి 28 భవనాల మంజూరు : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గానికి 28అంగన్‌వాడీ భవనాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. వీటిని రూ.7.14కోట్లతో ఆధునిక వసతులతో నిర్మిస్తామని చెప్పారు. శనివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని చాలా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేనందున వాటిల్లో పనిచేస్తున్న ఆయాలు, టీచర్లు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. మండల కేంద్రాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాల కోసం ప్రభుత్వంతో కొట్లాడి మంజూరు చేయించానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా విద్యకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని, అంగన్‌వాడీ కేంద్రాలు మొదలుకుని పీజీ వరకు నాణ్యమైన విద్య, ఆహారం అందిస్తూ విద్యను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా శాఖను సీఎం తనవద్దే ఉంచుకున్నారని, రాష్ట్రంలో ఒక్కోటి రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. దాతల సహకారంతో తాను ప్రభుత్వ జూనియర్ కళాశాలను కార్పొరేట్ స్థాయిలో నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. గతంలో ఈ కళాశాలలో 600మంది విద్యార్థులుంటే ప్రస్తుతం వెయ్యి మంది ఉన్నారని చెప్పారు.

పేదల ఆరోగ్యమే లక్ష్యం

పేదలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. క్యాంప్ కార్యాలయంలో 28మందికి రూ.11.16లక్షలు విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. పేదల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటుందన్నారు. వారి చికిత్సకు అవసరమయ్యే నిధులు సమకూరుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు విశాల శ్రావణ్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, గోపాల్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ శ్రీవర్ధన్‌రెడ్డి

నందిగామ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్వాతంత్ర్య అమరుల త్యాగాలు ప్రజలందరికీ తెలియాలని, తెలంగాణ ప్రభుత్వం సెప్టంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని తెలంగాణ విమోచన కమిటీ కన్వీనర్ శ్రీవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నందిగామలో ఆయన బీజేపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వీరుల పోరాటాల వల్లనే నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించిందని, తెలంగాణ చరిత్రను అన్ని తరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. 17న ప్రతీ బూత్‌లో జాతీయ పతాకాన్ని ఎగరవేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరవింద్‌చారి, ప్రభాకర్‌చారి, విక్రాంత్‌గౌడ్, మోహన్‌సింగ్, సుధాకర్, చెన్నయ్య, లక్ష్మణ్, ప్రవీణగౌడ్, శ్రీనివాస్, హేమంత్, నర్సింహాగౌడ్, శ్రీధర్‌చ రాజశేఖర్, కుమార్, సత్యం పాల్గొన్నారు.

సీఎం కృషితో గురుకులాలు బలోపేతం

● సంక్షేమశాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్



జాతీయ సెమినార్‌లో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ, మైనార్టీ గురుకుల విద్యా సంస్థలను బలోపేతం చేసి, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషిచేస్తామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. షాద్‌నగర్‌లోని తెలంగాణ ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ, పీజీ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీత పోలె ఆధ్వర్యంలో చేపట్టిన రెండు రోజుల ఏఐ జాతీయ కాన్ఫరెన్స్ శనివారం రాత్రి ముగిసింది. స్థానిక కుంట్ల రాంరెడ్డి గార్డెన్‌లో జరిగిన కార్యక్రమానికి మంత్రి లక్ష్మణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. విద్యాభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం మోడల్ రాష్ట్రం కావాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ప్రతీ నియోజకవర్గంలో రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నారని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల గురుకుల విద్యా సంస్థలకు సైతం సొంత భవనాలు నిర్మించి, సౌకర్యాలను పెంచేందుకు సీఎం, డిప్యూటీ సీఎంలు సంసిద్ధం వ్యక్తం చేశారని తెలిపారు. వచ్చే ఆరు నెలల్లో నిధులు తెచ్చి విద్యా సంస్థల బలోపేతానికి శ్రీకారం చుడతామన్నారు. ఏఐ టూల్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకుంటే విద్యా, ఉద్యోగం, వ్యాపార రంగాల్లో రాణిస్తూ, ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరిక మేరకు జహంగీర్ పీర్ దర్గాకు 8కోట్ల మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. గురుకుల విద్యా సంస్థలకు సొంత భవనాలు నిర్మించాలని మంత్రిని కోరారు. గత ప్రభుత్వంలో నిరాదరణకు గురైన ప్రభుత్వ విద్యావిధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలోపెట్టిందని, సమస్యలను పరిష్కరిస్తోందని చెప్పారు. ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల కార్యదర్శి కె.సీతాలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేలా సౌకర్యాలను కల్పిస్తూ, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అంతకుముందు మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు కె.వేణుగోపాల్‌రావు, లింగారెడ్డి, కె.నాగార్జునరావు, బాల్‌రాజ్, రాజ్‌బాబు, సూర్యప్రకాశ్, నటరాజ్ పాల్గొన్నారు.

సంక్షేమ గురుకుల కాలేజీని సందర్శించిన
ఏపీ సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి):ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంకుశాపూర్‌లోని తెలంగాణ సంక్షేమ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలను శనివారం ఏపీ సంక్షేమ గురుకులాల కార్యదర్శి ప్రసన్నవెంకటేశ్ సందర్శించారు. డిగ్రీ కళాశాలల నిర్వహణ ఎలా ఉంది? విద్యార్థినులు ఎంత మంది ఉన్నారు? ప్లేస్‌మెంట్స్ వస్తున్నాయా? ఆర్మీ కళాశాలను ఎలా నడిపిస్తున్నారు? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. భోజన వసతిపై, ప్రభుత్వ ఫండింగ్ ఎలా ఉంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గురుకుల విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శులు శర్మ, సక్రునాయక్, ప్రిన్సిపాళ్లు స్నేహలత, శారద, శ్రీలత, రేణుక పాల్గొన్నారు.



ఏపీ సంక్షేమ శాఖ కార్యదర్శి ప్రసన్నవెంకటేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థినులు



కేటీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, అర్జున్‌రావు, విజితారెడ్డి

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే జైపాల్

ఆమనగల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ ద్యావ విజితారెడ్డి, ఆమనగల్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోనుగోటి అర్జున్ రావులు శనివారం మాజీ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాలతో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని కేటీఆర్ సూచించినట్లు అర్జున్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసి పూర్వవైభవం తీసుకురావాలని పేర్కొన్నట్లు తెలిపారు.

రతన్‌సింగ్‌కు ఘన నివాళి



ఆమనగల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ తండ్రి రతన్ సింగ్ ఠాకూర్ మృతిపట్ల రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి సంతాపం తెలిపారు. కల్వకుర్తిలోని ఆయన నివాసంలో బాలాజీ సింగ్‌ను పరామర్శించారు. రతన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, పిప్పళ్ల వెంకటేశ్, పర్వత్‌కుమార్ యాదవ్, మాదారం గణేశ్, తదితరులు ఉన్నారు.

ఇసుక కష్టాలు!

(ఐదో పేజీ తరువాయి)

దొడ్డు ఇసుక టన్నుకు రూ.2600 నుంచి రూ. 2700 పలుకుతుండగా, సన్న ఇసుక రూ.2300 నుంచి రూ.2400 పలుకుతుంది. మరో వారం రోజులు ఆగితేగాని ఇసుక ధరలు దిగి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇసుక బజార్లు

బహిరంగ మార్కెట్‌లో ఇసుక లభ్యత తక్కువగా ఉండటంతో ఇసుక బజార్‌లకు డిమాండ్ పెరిగింది. జీరో దందాను అరికట్టి నాణ్యమైన ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఇసుక బజార్‌లకు ప్రస్తుతం మంచి ఆదరణ లభిస్తుంది. వర్షాకాలంలో ఇసుక కొరతను అంచనా వేసిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇసుక బజార్‌లను ప్రారంభించింది. హైదరాబాద్ నగర శివార్లలో ఆదిభట్ల, అబ్దుల్లాపూర్‌మెట్, వట్టినాగులపల్లి, బొంరాస్‌పేట్‌లలో సాండ్ బజార్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ సన్న ఇసుక టన్నుకు రూ.1800, దొడ్డు ఇసుక టన్నుకు రూ.1600 చొప్పున ధరలు ఫిక్స్ చేశారు. ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో బయట మార్కెట్లో కూడా ఇసుక ధరలు కొంత నిలకడగా ఉండడంతో ఇసుక బజార్‌లకు ఆదరణ కరువైంది. బయట మార్కెట్లో టన్ను ధర రూ.2000 నుంచి రూ.2100 అటుఇటుగా ఉంది. దీంతో వినియోగదారులు బయట మార్కెట్‌లోనే ఇసుకను కొనుగోలు చేశారు. పైగా ఆన్‌లైన్‌లో డీడీలు కట్టి లారీ తీసుకెళ్లి ఇసుక తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. డీడీ చెల్లించడానికి సైట్ ఎంతసేపు ఆన్‌లో ఉంటుందో చెప్పలేం. దీనిపై చాలామందికి అవగాహన లేకపోవడం, లారీ కిరాయి ఎక్కువగా ఉండటం కారణంగా బయట మార్కెట్‌లోనే ఇసుక కొనుగోలు చేస్తున్నారు. వాహనాల కిరాయి చూసుకుంటే ఇసుక బజార్‌లో కొనుగోలు చేసినా బహిరంగ మార్కెట్‌లో అయినా దాదాపుగా అదే ఖర్చు వస్తుంది. దీంతో 15 రోజుల క్రితం వరకు ఎవరూ ఇసుక బజార్ల వైపు కన్నెత్తి చూడలేదు.

ఇసుక కొరతతో పెరిగిన ధరలు

హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాలు, రంగారెడ్డి జిల్లాకు కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, ఏటూరునాగారం, ఖమ్మ-కొత్తగూడెం, కర్నూలు, విజయనగరం నుంచి ఇసుక ఎక్కువగా దిగుమతి అవుతుంది. ఈ ప్రాంతాల నుంచి ఇక్కడికి సుమారు 200 నుంచి 300 కిలోమీటర్ల దూరం ఉంటుంది. గ్రీన్‌ట్రిబ్యునల్ మూలంగా ఈ మధ్య కాలంలో కరీంనగర్, పెద్దపల్లి, కాళేశ్వరం వద్ద చాలావరకు ఇసుక రీచ్‌లు బంద్ అయ్యాయి. దీంతో ఇసుక ధరలు సామాన్యుడికి తీరని భారంగా మారాయి. ఈ మధ్య కాలంలో ఇళ్ల నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇటీవల పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. ప్రస్తుతం వాటి నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇసుక రవాణాకు అంతరాయం ఏర్పడడంతో బయట మార్కెట్లో ఇసుక ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. దీంతో ఇంటినిర్మాణదారులకు ఇసుక ఖర్చు భారంగా మారింది.



ఇసుక బజార్‌లో లోడవుతున్న లారీ

రాక్ సాండ్‌తో నిర్మాణాలు

ఇసుక ధరలు పెరగడంతో నిర్మాణాలకు ఎక్కువగా రాక్ సాండ్ (రోబో సాండ్) వాడుతున్నారు. ఇసుకకు రాక్ సాండ్‌కు ధరలో భారీ వ్యత్యాసం ఉండడంతో నిర్మాణ వ్యయం కూడా తగ్గుతోంది. దీంతో బిల్డర్లు, కాంట్రాక్టర్లు రెడీమిక్స్ యాజమాన్యాలు రోబో సాండ్ వినియోగం వైపు మొగ్గు చూపుతున్నారు. రాక్ సాండ్ టన్ను ధర రూ.450 నుంచి రూ.500 ఉంది. పెరిగిన ఇసుక, స్టీల్, సిమెంట్, కంకర ధరలతో ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఇస్తున్న రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి లేకపోవడంతో నిర్మాణానికి కొందరు రాక్ సాండ్ వాడుతున్నారు.

ఇసుక బజార్‌లకు డిమాండ్

ఇసుక బ్లాక్ మార్కెట్‌కు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇసుక బజార్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. కొంత కాలంగా మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో జీరో దందా నడుపుతున్న ఇసుక డంప్‌లపై రెవెన్యూ, విజిలెన్స్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి కేసులు సైతం నమోదు చేశారు. దీంతో ఒక్కసారిగా డంపులు మూతబడడంతో ఇసుక ధరలు నిలకడగా ఉన్నాయి. ఆదిభట్లలో 10 ఎకరాల విస్తీర్ణంలో ఇసుక బజార్‌ను ఏర్పాటు చేసి 90 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచారు. ఈ ఇసుకను భద్రాచలం, వంగమర్తి, వీరాపురం, విజయనగరం, అనంతారం నుంచి ఇసుక తీసుకొచ్చి డంప్ చేశారు. ప్రస్తుతం ఇసుక కొరత ఉండడంతో రోజుకు 30 నుంచి 40 లారీలు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొని ఇసుక బజార్‌కు క్యూ కడుతున్నాయి. నిర్మాణదారులెవరైనా తేలికగా బుక్ చేసుకొని పని ప్రదేశానికే ఇసుకను తెప్పించుకోవడానికి ప్రభుత్వం వీలు కల్పించింది. నాలుగు నెలల వ్యవధిలో 17 మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలు జరిగితే... నెల రోజుల్లోనే 30 వేల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాలు జరిగాయి. ఇంకనూ ఆదిభట్ల బజార్‌లో ప్రస్తుతం సన్న ఇసుక 36 వేల మెట్రిక్ టన్నులు, దొడ్డు ఇసుక 7 వేల మెట్రిక్ టన్నుల వరకు అందుబాటులో ఉంది.

ప్రభుత్వం చొరవతోనే..



ఇసుకను సామాన్యులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మేలు జరుగుతుంది. వర్షాకాలంలో ఇసుక దొరకడం లేదు. దళారులు ఇసుక కొరత ఉన్నప్పుడు ఇష్టమొచ్చినట్లు ధరలు పెంచి అమ్మేవారు. ప్రస్తుతం ఇసుక బజార్‌లు ఉండడంతో ఇళ్లు కట్టుకునే వాళ్లకు సన్న, దొడ్డు ఇసుక సరసమైన ధరకు దొరుకుతుంది. ఆదిభట్లలో పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయి. నిర్మాణాలకు ఇక్కడి నుంచి ఇసుక తీసుకుపోతున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలనిస్తుంది.

- జమ్మ రాజు ఆదిభట్ల

ఇసుక బజార్‌కు డిమాండ్ పెరిగింది

ఇసుక బజార్‌కు మొదట్లో ఆదరణ నామమాత్రంగానే ఉండేది. నెలకు 100 నుంచి 150 టన్నుల ఇసుక అమ్మేది. ఈ మధ్య కాలంలో వర్షాలు బాగా కురవడంతో ఇసుక కొరత ఉంది. దీంతో ఇసుక బజార్‌లకు డిమాండ్ పెరిగింది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాకుండా హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో లారీలు వస్తున్నాయి. రోజుకు 30 నుంచి 40 లారీలు క్యూ కడుతున్నాయి. నెల రోజుల నుంచి ఇక్కడ సేల్ బాగుంది.

- ప్రశాంత్, ఇసుక బజార్ అధికారి

క్రైం కార్నర్

పాముకాటుతో యువకుడి మృతి

మంచాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాపాలలో పాముకాటుతో యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. జాపాలకు చెందిన దొంతరమోని లింగం(27) శుక్రవారం వ్యవసాయ పొలం వద్ద పనులు చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి లింగం శనివారం మధ్యాహ్నం మృతిచెందాడు. కాగా, ఆయనకు ఇటీవల వివాహమైంది. లింగం మృతితో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.

గుండెపోటుతో టిప్పర్ డ్రైవర్..

- చెట్టును ఢీకొన్న వాహనం



అశోక్(ఫైల్)

కందుకూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): టిప్పర్ నడుపుతుండగా డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో మృతిచెందిన ఘటన మండల పరిధిలోని కటికపల్లిలో చోటుచేసుకుంది. టిప్పర్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టి నిలిచిపోయింది. దాంతో ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టకుండా పెను ప్రమాదం తప్పినట్లైంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కటికపల్లి గ్రామానికి చెందిన ఎంట్ల అశోక్(35) మండల కేంద్రంలోని వెంకట్‌రావు బ్రిక్ కంపెనీలో టిప్పర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగానే ఆదివారం మధ్యాహ్నం కటికపల్లి గ్రామ సమీపంలో ఉన్న కంకర మెషీన్ వద్ద లోడ్ చేసుకొని మండల కేంద్రానికి బయలుదేరాడు. ఈక్రమంలో డ్రైవర్ అశోక్‌కు గుండెపోటు వచ్చింది. స్థానికులు 108కు ఫోన్‌చేయగా అంబులెన్స్ సిబ్బంది చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. అతడికి భార్య ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

దాయాదుల ఘర్షణ.. వేట కొడవళ్లతో దాడి

- ఒకరికి తీవ్ర గాయాలు

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): దాయాదుల మధ్య ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలైనాయి. షాద్‌నగర్ పట్టణంలోని కేశంపేట రోడ్డులో ఈ ఘటన శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన గంతల ప్రభు మొదటి భార్య కుమారుడు పృథ్వీరాజ్ శనివారం ఉదయం తన పిల్లలతో కలిసి పాలు తీసుకురావడానికి బయటకు వెళ్లాడు. దారిలో ప్రభు రెండో భార్య కుమారులైన నందీశ్వర్, భరత్‌లు అతడిని అడ్డగించి గొడవకు దిగారు. ముగ్గురి మధ్య వివాదం పెద్దది కావడంతో.. అప్పటికే వారు వెంట తెచ్చుకున్న వేట కొడవళ్లతో వారిద్దరూ పృథ్వీరాజ్‌పై దాడి చేశారు. ఛాతి, మెడపై వేట కొడవలితో దాడి చేయడంతో పృథ్వీరాజ్‌కు తీవ్ర గాయాలైనాయి. అయితే, నందీశ్వర్ పెళ్లి విషయంలో వారు గొడవపడ్డారని, పృథ్వీరాజ్ వల్లే అతడి పెళ్లి సంబంధం కుదరలేదని, దానిని మనసులో పెట్టుకుని దాడికి పాల్పడినట్లు సమాచారం. కాగా, పృథ్వీరాజ్‌ను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆదిభట్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేష్ కథనం మేరకు.. బాలాపూర్ మండలం కురుమల్‌గూడకు చెందిన జటావత్ మోతీలాల్(40) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 8న భార్యతో గొడవపడి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దాంతో కుటుంబ సభ్యులు ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రాజీమార్గమే రాజమార్గం

- సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు
- జాతీయ లోక్ అదాలత్‌లు..

కేసుల పరిష్కారం.. జరిమానా విధింపు

చేవెళ్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజీమార్గమే రాజమార్గమని, కేసుల సత్వర పరిష్కారం కోసమే లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నామని చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య తెలిపారు. శనివారం చేవెళ్ల కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి ఉపాధ్యా య విజయ్‌కుమార్‌తో కలిసి జాతీయ లోక్ అ దాలత్ నిర్వహించారు. మొత్తం 1014కేసులు ప రిష్కరించి.. రూ.24లక్షల 18,300 జరిమానా వే శారు. విశ్రాంత న్యాయమూర్తి సాంబశివరావు, కోర్టు, పోలీస్ అధికారులు సిబ్బంది ఉన్నారు.



ఇబ్రహీంపట్నం : మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి

ఆమనగల్లులో 53 కేసుల పరిష్కారం

ఆమనగల్లు : పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయలోక్ అదాలత్ జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అధ్యక్షతన నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పోలీసు స్టేషన్ల పరిధిలో 53కేసులు పరిష్కరించారు. రాజీమార్గమే రాజమార్గమని ఆమె అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్, సీఐలు జానకిరామ్ రెడ్డి, గంగాధర్, వేణుగోపాల్, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్, ఏపీపీ కార్తిక్, ఎస్సైలు వెంకటేశ్, వరప్రసాద్, శ్రీకాంత్, సీతారాంరెడ్డి, చంద్రశేఖర్, న్యాయవాదులు ఉన్నారు

పట్నంలో 1,112 కేసులు..

ఇబ్రహీంపట్నం : జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం ఇబ్రహీంపట్నం న్యాయస్థానంలో రాజీపడ్డదగ్గ 1,112 కేసులను పరిష్కరించినట్లు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి తెలిపారు. అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి రీటా లాల్‌చంద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి యశ్వంత్‌సింగ్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి హిమబిందు, ఏసీపీ కేపీవీ రాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముద్దం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో 107..

యాచారం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్, యాచారం పరిధిలో పలు కేసులు రాజీ చేసుకున్నట్లు సీఐలు ఎ.నందీశ్వర్‌రెడ్డి, సత్యనారాయణలు తెలిపారు. ఇబ్రహీంపట్నం కోర్టులో శనివారం మెగా లోక్‌అదాలత్‌ను న్యాయాధికారులు నిర్వహించారు. హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌పరిధిలో 39 కేసులు, యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో 68 కేసులు పరిష్కారమైనట్లు సీఐలు తెలిపారు.



చేవెళ్ల : మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య

కాలేజీ నిర్మాణానికి భూరి విరాళం



షాద్‌నగర్ : చెక్కు అందిస్తున్న ఖాజాపాషా

షాద్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): దాతల సహకారంతో నిర్మిస్తున్న జూనియర్ కళాశాల నిర్మాణానికి భారీ విరాళాన్ని అందజేశారు. కొత్తూరు మండలానికి చెందిన ఎస్‌కేపీ రెడీమిక్స్ ప్లాంట్ యజమాని ఖాజాపాషా శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి రూ.20 లక్షల చెక్కు అందజేశారు.

శరన్నవరాత్రుల పోస్టర్ ఆవిష్కరణ

దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఎలికట్ట అంభ భవాని ఆలయంలో ఈ నెల 22 నుంచి వచ్చేనెల 2వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే శంకర్, మాజీ జడ్పీటీసీలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి ఆవిష్కరించారు.

గంధోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

కొందుర్గు : మండల కేంద్రంలో ఈనెల 19న నిర్వహించే హజ్రత్ సయ్యద్ షావలీ ఖాద్రి గంధోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని ముస్లిం మతపెద్దలు ఎమ్మెల్యే శంకర్‌ను ఆహ్వానించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో మతపెద్ద మౌలానా అబ్దుల్ కఫూర్ అన్సారీ రుద్దారి ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అజ్మత్ షఫీ షరీఫ్, ఖాజాపాషా, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆనందమయ జీవనం



రాఘవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, సెప్టెంబరు 13(ఆంధ్ర జ్యోతి): ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ఒత్తిళ్లను అధిగమించి ఆనందమయ జీవనం పొందవచ్చునని టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయాన్ని శనివారం సుంకిరెడ్డి సందర్శించారు. ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు తోడ్పాటునందిస్తానని ఆయన తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి గడపకూ ఐక్యత ఫౌండేషన్ సేవలను విస్తరిస్తామని తెలిపారు. కల్వకుర్తి పట్టణంలో త్వరలో స్కిల్ సెంటర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, లింగంపల్లి ఆనంద్, రచ్చ శ్రీరాములు, రాజశేఖర్, కృష్ణ, నయనాచారి, తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరం విజయవంతం



వైద్యపరీక్షల రిపోర్టులు అందిస్తున్న సుంకిరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయం వద్ద శనివారం జర్నలిస్టులకు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. వన్‌మెడి సంస్థ ఆధ్వర్యంలో ఐక్యత ఫౌండేషన్ సహకారంతో శిబిరం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములుతో కలిసి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన 110 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు శిబిరంలో వైద్యులు గుండె, లివర్, కిడ్నీ, రక్తపరీక్షలు నిర్వహించి వైద్యసలహాలు అందజేశారు. ఆరోగ్య కిట్లను జర్నలిస్టులకు పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు, నాయకులు జైపాల్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, మల్లేశ్ నాయక్, గణేశ్, కొండల్ యాదవ్, రమేశ్ నాయక్, యాదయ్య, శ్రీపతి, శేఖర్, శ్రీను, కల్యాణ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

నందిగామ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని గురుస్వామి గిరీషన్‌నాయర్ కోరారు. మండల కేంద్రంలోని అయ్యప్ప దేవాలయం పునర్‌నిర్మాణంలో భాగంగా అయ్యప్ప, గణపతి, మాలికాపురోత్తమ అమ్మవార్ల మండపాలు నూతనంగా నిర్మించారు. ఆలయం నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతుండడంతో శనివారం గిరీషన్‌నాయర్ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జిల్లెల్ల బాల్‌రెడ్డి, సభ్యులు చెక్కల ఎల్లయ్య, రామన్న, జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, లక్ష్మయ్య, కుమార్ గౌడ్, బంట్రపు జంగయ్యగౌడ్, శ్రీకాంత్, తుమ్మల నర్సింలు, మల్లేష్, లింగం, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ బాక్స్.. విద్యార్థులకు ప్లేట్లు, బాటిళ్లు అందజేత

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం రంగంపల్లి పాఠశాలకు శనివారం దాతలు సౌండ్ బాక్స్ విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిళ్లు అందజేశారు. గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ ఆధ్వర్యంలో సంస్థ తరఫున మురహరిగౌడ్ అందజేశారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని పంపిణీ చేసినట్లు తెలిపారు. మొగిలిగిద్ద హెచ్ఎం శేఖర్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం శివకుమార్, టీచర్లు ఉన్నారు.



పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న నీరటి మల్లేశ్

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేశ్ అన్నారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, కనీస వేతనం రూ.18వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నీరటి మల్లేశ్, అధ్యక్షుడిగా గణేశ్, ఉపాధ్యక్షులుగా సుధాకర్, లావణ్య, ప్రధాన కార్యదర్శిగా సరిత, కార్యదర్శులుగా సావిత్రి, కమలమ్మ, కోశాధికారిగా లక్ష్మీదేవి, సహాయ కార్యదర్శులుగా రాజేశ్, రవీందర్, రామలక్ష్మి, సభ్యులుగా మల్లమ్మ, కల్పన, నర్సింగ్‌రావు, లావణ్య, శివరాణి, యాదమ్మ, రజిత తదితరులు ఎన్నికయ్యారు.

అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరు

చౌదరిగూడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో నూతనంగా నిర్మించే అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు శనివారం ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని గాలిగూడ-2, చౌదరిగూడ, లచ్చంపేట, రావిర్యాల గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిధులు మంజూరు చేయించడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నోటిఫికేషన్లు ఇవ్వాలి

మంచాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా నోటిఫికేషన్లు ఇవ్వలేదని, వెంటనే జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు లాలగారి జంగయ్య కోరారు. శనివారం మంచాలలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి గాలికొదిలేసిందని ఆరోపించారు. 100రోజుల్లో ఆరుగ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. పూర్తిస్థాయిలో ఒక్క గ్యారెంటీనీ అమలు చేయలేదనిన్నారు. జాబ్‌క్యాలెండర్ అమలు చేయకపోతే నిరుద్యోగులతో ఆందోళనలు చేపడతామన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

తలకొండపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చంద్రదనకు చెందిన మల్లయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని శనివారం మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు. మల్లయ్య మృతి పట్ల సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.3వేలు సమకూర్చగా స్థానిక నాయకులు, ట్రస్ట్ సభ్యులు అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ ఉప సర్పంచ్ సుధాకర్, నాయకులు జంగయ్య గౌడ్, చెన్నయ్య, యాదయ్య, శేఖర్ యాదవ్, మల్లేశ్, బాలకిష్టయ్య, నరేందర్, అజయ్, తిరుపతయ్య, తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికులకు దుస్తులు అందజేత



కార్మికులకు దుస్తులు అందిస్తున్న పాండు

కేశంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మణికంఠ మెడికల్ షాపు యజమాని పిప్పళ్ల పాండు ఉదారత చాటుకున్నాడు. కేశంపేట గ్రామ పంచాయతీ కార్మికులకు రూ. 10వేలు ఖర్చు చేసి దుస్తులు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ గ్రామ కమిటీల సమావేశాలు

కందుకూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మడవెల్లి, మాదాపురం, కొలన్‌గూడ గ్రామాలలో నేడు(ఆదివారం) బీఆర్ఎస్ గ్రామ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్ తెలిపారు. ఆదివారం ఉదయం 9:30 గంటలకు గుమ్మడవెల్లి, 10:30 గంటలకు మాదాపురం, 11:30 గంటలకు కొలన్‌గూడలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా 3వ మహాసభలు ఈనెల 27న కందుకూరు మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో సభలకు సంబంధించి రూపొందించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను నాయకులతో కలిసి సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. నాయకులు యూనుస్, శంకర్, జలందర్, రాచాలపల్లి నర్సింహ, తూర్పు శ్రీను, తిరుపతి, చంద్రకుమార్, తదితరులున్నారు.

తలకొండపల్లి : మాదాయిపల్లిలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో ఎంపీ డాక్టర్ మల్లురవి నిధులు రూ.కోటీ 50లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌లను మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. నర్సిములు, అజీజ్, కృష్ణయ్యగౌడ్, తదితరులున్నారు.

తలకొండపల్లి : రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను తలకొండపల్లి మండల బీసీ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాలతో సత్కరించారు. బీసీల సమస్యలు కృష్ణయ్య దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. రాజేందర్, వెంకటయ్య, లింగంగౌడ్, రాఘవేందర్, మాధవాచారి, తదితరులు ఉన్నారు.

సేవా కార్యక్రమాలు చేపడదాం



ఆదిభట్ల : మాట్లాడుతున్న అంజయ్య

షాబాద్/ఆదిభట్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 17న ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని బూత్‌స్థాయి నుంచి సేవా కార్యక్రమాలు చేపడదామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం షాబాద్ మండలం నాగర్‌గూడలో మండలాధ్యక్షుడు మాణయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని ప్రతీ గ్రామంలో మొక్కలు నాటడం, స్వచ్ఛభారత్, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మండల సేవా పక్వాడా కన్వీనర్, బీజేవైఎం మండలాధ్యక్షుడు మహేశ్, కోకన్వీనర్ రవిగౌడ్, సందీప్, నాయకులు శ్రీను, మహేందర్, సురేశ్‌గౌడ్, తదితరులున్నారు. కాగా, మోదీ జన్మదినం రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్యయాదవ్ అన్నారు. ఆదిభట్ల మున్సిపల్ పరిధి కల్వకోల్ దేవకమ్మ ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం గజ్జల నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మోదీ 75వ జన్మదిన సందర్భంగా 75 మందితో 75 యూనిట్ల బ్లడ్ డొనేషన్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు తలపెట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నారాయణ, పండల లక్ష్మీపతిగౌడ్, మనోహర్ లాల్, హరిశంకర్, శ్రీదేవి, బూత్ అధ్యక్షులు తదితరులు ఉన్నారు.